క్లుప్తంగా

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న జడ్జి ప్రియాంక

గజ్వేల్‌రూరల్: కక్షిదారులు సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అదనపు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, మండల సేవాధికార సంస్థ చైర్మన్ ప్రియాంక పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో ఆమె మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9న గజ్వేల్‌లో జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎక్కువ మందికి న్యాయం జరిగేలా న్యాయవాదులు, పోలీసులు, సంబంధిత అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ రమేష్, పోలీస్ సిబ్బంది, మండల్ లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహచారి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తిగుల్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌ను మండలం చేయాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 4 వందల రోజులకు చేరుకున్నాయి. తిగుల్ మండల సాధన సమితి సభ్యులు, సర్పంచ్ భానుప్రకాష్‌రావు సోమవారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలం ప్రకటించకపోతే రానున్న సాధారణ ఎన్నికలను బహిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల సాధన సమితి సభ్యులు మహేందర్ రెడ్డి, శ్రీరాంరెడ్డి, సత్తిరెడ్డి, రాములు, నాగరాజు, నితిష్‌రెడ్డి, నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

సిద్దిపేటరూరల్: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించి, పాటించేలా చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఇర్కోడ్ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పర్షరాములు, అధ్యాపకులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యాపారవేత్త మృతి



విశ్వంగుప్తా (ఫైల్)

దుబ్బాకటౌన్: ప్రముఖ వ్యాపారవేత్త, వీమార్ట్ షాపింగ్ మాల్స్ అధినేత తడకమడ్ల విశ్వంగుప్తా (56) అనారోగ్యంతో కన్నుమూశారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేటకు చెందిన విశ్వం కిందిస్థాయి నుంచి వ్యాపారరంగంలో ఉన్నతస్థాయికి ఎదిగారు. మొదట కిరాణంతో ప్రారంభమై రైస్‌మిల్స్ స్థాపించారు. నాణ్యమైన బియ్యం సరఫరా చేసి రాష్ట్రంలోనే గుర్తింపు పొందాడు. అనంతరం రియల్ ఎస్టేట్‌తో పాటు వీమార్ట్ నెలకొల్పారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా అప్పటికే కన్నుమూశారు. విశ్వంగుప్తా మృతిపై ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, కాంగ్రెస్ నాయకుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సంతాపం తెలిపారు.

'మా స్థలం మాకే కేటాయించండి'

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం సమీపంలో 8 ఏళ్ల క్రితం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన నిత్యాన్నదాన సత్రానికి 10 గుంటల స్థలం కేటాయించారని.. అదే స్థలం మాకు కావాలని గౌడ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై సోమవారం గౌడ సంఘం నాయకులు తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సిద్దిపేట ఆర్‌డీఓ రమేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమకు కేటాయించిన స్థలంలో రూ. 2 లక్షలు ఖర్చు చేసి బోరు బావి తవ్వించామని, కొందరు వ్యక్తులు కావాలనే అక్కడ నిర్మాణం చేయనివ్వడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు మెరుగు కృష్ణగౌడ్, ముత్యం నర్సింహులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గుప్పుమంటున్న గుడుంబా!

గుట్టు చప్పుడు కాకుండా అమ్మకాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): పల్లెలు, మారుమూల తండాల్లో గుడుంబా మళ్లీ గుప్పుమంటోంది. కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్న నాటుసారా తయారీ మళ్లీ పుంజుకుంటోంది. గుట్టుచప్పుడు కాకుండా తయారు చేసి రహస్యంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ దందా సాగిస్తున్నారు. తాగడానికి నీరు దొరకని గ్రామాల్లోనూ నాటుసారా పుష్కలంగా లభిస్తోంది. గుడుంబా తయారీ, విక్రయాలపై అడిగేవారు.. ఆపేవారు లేకపోవడంతో దందా 'మూడు పువ్వులు, ఆరు సీసాలు'గా సాగుతోంది.

అక్కన్నపేట మండలంలోని దుబ్బతండా, చాపగానీతండా, పెద్దతండా, కేశనాయక్ తండా, పంతుల్‌తండా, కపూర్‌నాయక్‌తండా, మసిరెడ్డితండా, మల్‌చెర్వుతండా గ్రామాలతో పాటు వీటి పరిధిలోని తండాల్లో గుడుంబా తయారు చేసి చుట్టుపక్కల ప్రాంతాలు, పట్టణాలకు తరలిస్తున్నారు. గతంలో గుడుంబా తయారు చేసేవారికి రాష్ట్ర ప్రభుత్వం పునరావాసం కల్పిస్తూ పలు పథకాలను అమలు చేసింది. అయినప్పటికీ కొందరు గుడుంబా తయారుచేయడమే వృత్తిగా పెట్టుకుని దందా సాగిస్తున్నారు.



అక్కన్నపేట మండలంలోని ఓ గిరిజన తండాలో గుడుంబా తయారీ (ఫైల్)

మామూళ్ల మత్తులో యంత్రాంగం

నాటుసారాను నియంత్రించే ఎక్సైజ్ అధికారులు అడపాదడపా దాడులు నిర్వహిస్తున్నారని, మామూళ్లకు కక్కుర్తిపడి తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టుబడినప్పటికీ కఠిన చర్యలు తీసుకోకపోవడంతో మళ్లీ గుడుంబా వ్యాపారం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు బెల్లం, పటిక విక్రయాలను నియంత్రించాలని పలువురు పేర్కొంటున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం



ప్రతీరోజు పల్లెలు, తండాల్లో దాడులు ముమ్మరం చేసి కేసులు నమోదు చేస్తున్నాం. అక్కన్నపేట మండలంలోని గిరిజన తండాల్లో ఎక్కువగా గుడుంబా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంది. డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సహకారంతో నెలరోజులుగా దాడులు చేసి పూర్తిగా గుడుంబా నివారణకు చర్యలు తీసుకుంటాం. – పవన్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ, హుస్నాబాద్

దేవాలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం మహ్మదాపూర్‌లో మహాచండీ అమ్మవారి దేవాలయ నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజలో పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక వికాసానికి దేవాలయాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అమ్మవారి అలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే పందిల్లలో మహాలింగేశ్వరస్వామి అలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి, డీపీఓ దేవకిదేవి, ఎంపీపీ లకావత్ మానస, సర్పంచ్‌లు పిట్టల సంపత్, తోడేటి రమేశ్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అన్నివర్గాలను ఆదుకుంటాం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లికి చెందిన యాస శ్రీనివాస్ అనే లబ్ధిదారునికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన కారును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సతీష్ కుమార్ అందజేశారు. రాష్ట్రంలో అన్నివర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

లక్ష్యం దిశగా ముందుకు సాగాలి

గజ్వేల్ ఏసీపీ రమేశ్

గజ్వేల్‌రూరల్: విద్యార్థినులు ఇప్పటి నుంచే ఓ లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ దిశగా ముందుకు సాగాలని గజ్వేల్ ఏసీపీ రమేశ్ సూచించారు. ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం బాలికలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే 100 లేదా షీటీం వాట్సాప్ నంబర్ 8712667434 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థినులు చదువుతో పాటు లక్ష్యం దిశగా అడుగులు వేయాలని, ఉన్నతస్థానంలో నిలిచినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజుల, ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ సత్యనారాయణరెడ్డి, షీటీం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లను అప్పగించాలి

హుస్నాబాద్: లక్కీడ్రా ద్వారా డబుల్ బెడ్రూం ఇళ్లను ఎంపిక చేసి వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. గత నాలుగు నెలల క్రితం డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుల కోసం డ్రా ద్వారా ఎంపిక చేసినప్పటికీ నేటికీ ఇండ్లను అప్పగించలేదన్నారు. ఏళ్లుగా కిరాయి ఇళ్లల్లో ఉంటూ అద్దె చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు కేటాయించిన ఇండ్లను అప్పగించి ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రవీందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ధర్నా

తుమ్మ చెట్లు తొలగించారు



హుస్నాబాద్‌రూరల్: పట్టణంలోని 4వ వార్డులో సీసీ రోడ్డును తుమ్మ చెట్లు కమ్మేయగా ఆదివారం 'సాక్షి'లో తుమ్మ చెట్లను తొలగించరూ..? అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత సోమవారం సిబ్బందితో తుమ్మ చెట్లను తొలగించి వాహనదారుల ఇబ్బందులను తీర్చారు.

'వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'

కోహెడరూరల్(హుస్నాబాద్): వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నారాయణపూర్‌లో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే పథకాలను వివరించాలని సూచించారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న పొన్నం, ప్రవీణ్‌రెడ్డి

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట- భూంపల్లి మండల కేంద్రానికి చెందిన 30 మంది వివిధ పార్టీల కార్యకర్తలు, యువకులు క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

పెసరు సాంబరాజు



మాట్లాడుతున్న సాంబరాజు

అక్కన్నపేట(హుస్నాబాద్): కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి, బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు సవాల్ విసిరారు. మండల కేంద్రంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, ముఖ్య నాయకులతో కలిసి సోమ వారం మాట్లాడారు. మచ్చలేని ఎమ్మె ల్యే సతీష్‌కుమార్‌పై అనవసర విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. మెట్టప్రాంతంలో గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తి కా వొద్దని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులతో కేసులు వేయించి అడ్డుకున్నారని.. ఎన్ని కుట్రలు చేసిన నిండుకుండలా జలకళను సంతరించుకుందని కొనియాడారు.

బీజేపీ జమిలి నాటకం

టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జమిలి ఎన్నికల పేరిట బీజేపీ కొత్త డ్రామాను తెరమీదకు తీసుకువచ్చిందని టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం విమర్శించారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో విపక్ష కూటమి విజయం సాధిస్తుందనే జమిలి అంటూ నాటకాలు మొదలు పెట్టారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశ, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, నంగునూరు మండల అధ్యక్షుడు తప్పెట శంకర్, నాయకులు రమేష్, గయాజుద్దీన్, మధు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించండి

దుబ్బాక: కేంద్ర ప్రభుత్వం నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గొడ్డుబర్ల భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం దుబ్బాక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిత్యావసర ధరలను విపరీతంగా పెంచి సామాన్య ప్రజలపై భారం మోపుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాజిద్, మల్లేశం, రాజు, శంకర్, నర్సింలు, మైమూద్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం

కొండపాక(గజ్వేల్): కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మండల పరిధిలోని వెలికట్టలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాల్‌నర్సయ్య, నాయకులు కనకయ్య, రవీంద్రచారి, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాక: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



పూరిగుడిసె ఎదుట మనమడితో వృద్ధురాలు

గూడు.. తీరని గోడు

గజ్వేల్‌రూరల్: గూడులేక ఓ వృద్ధురాలు తీవ్ర ఇబ్బంది పడుతోంది. గజ్వేల్ పట్టణంలోని 9వ వార్డుకు చెందిన మస్కురి బుచ్చమ్మ తన భర్త మృతితో ఓ పూరి గుడిసెలో జీవనం సాగిస్తుంది. ఇద్దరు కొడుకులు ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో పెద్ద కొడుకు కుమారుడితో కలిసి ఉంటుంది. వర్షాలతో అవస్థలు పడుతున్నానని.. డబుల్ బెడ్రూం కేటాయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంది. అయినా ఫలితం లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ గుడిసెలోనే కాలం వెళ్లదీస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి డబుల్ బెడ్రూం కేటాయించాలని వేడుకుంటుంది.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

ఎంపీపీ కీర్తి



మాట్లాడుతున్న ఎంపీపీ కీర్తి

కోహెడ(హుస్నాబాద్): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ శాఖల పనితీరుపై చర్చించారు. మండలంలో నెలకొన్న సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మండలంలో రూ. 24 కోట్ల రుణ మాఫీ జరిగిందన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి చూపాలని రైతులను కోరారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తడకల రాజిరెడ్డి, ఎంపీడీఓ మధుసూదన్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలో అయ్యప్ప దేవాలయ 21వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లికి డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో విద్యార్థులు డిగ్రీ చదివేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. దామోదర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు మండల సమావేశం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మాలోతు లక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ జీపీగా ప్రకటించాలని వినతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని గోపాల్‌పూర్‌ను ప్రత్యేక గ్రామ పంచాయతీగా చేయాలని కోరుతూ సోమవారం ఎంపీటీసీ కిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

◆ దాడి చేసిన వారిని శిక్షించాలి

బెజ్జంకి(సిద్దిపేట): మంచిర్యాల జిల్లా మందమర్రిలో దళిత యువకుడిపై దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా సహాయ కార్యదర్శి బొనగిరి రూపేష్ సోమవారం డిమాండ్ చేశారు.

◆ ఆహ్వానం

హుస్నాబాద్: నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలం వల్బాపూర్‌లో ఈనెల 6వ తేదీన జరిగే కృష్ణాష్టమి వేడుకలకు రావాలని సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు నిర్వాహకులు ఆహ్వాన పత్రిక అందజేశారు.

◆ విరాళం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని వింజపల్లిలో నిర్మిస్తున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి రూ. 50 వేల విరాళం అందించారు.

◆ ఓటరుగా నమోదు చేసుకోవాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): యువత ఓటరుగా నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ జయలక్ష్మి సూచించారు. సోమవారం చిన్నకోడూరులో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బూత్ లెవల్ అధికారులు గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి ఓటరు జాబితాలో నమోదు చేయించాలని సూచించారు.

◆ రిలే నిరాహార దీక్షలు వాయిదా

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నేటి నుంచి జేఏసీ తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ తెలిపారు. ఈనెల 11న దీక్షలు ప్రారంభించనున్నట్లు చెప్పారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కామర్స్ (1) సబ్జెక్టును బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. 2023–24 విద్యాసంవత్సరంలో విద్యార్థులకు కామర్స్ సబ్జెక్టు బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 8వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

◆ మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోండి

కొమురవెల్లి(సిద్దిపేట): మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ రాంప్రసాద్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు.

◆ నేడు బీసీ రౌండ్‌టేబుల్ సమావేశం

గజ్వేల్‌రూరల్: బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించ తలపెట్టిన బీసీ రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని బీసీ నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, మాజీ జెడ్పీటీసీ మల్లేశం పిలుపునిచ్చారు.

◆ ఎస్‌జీఎఫ్ క్రీడలు

మద్దూరు(హుస్నాబాద్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం మద్దూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం క్రీడలు నిర్వహించారు. పోటీలను మండల విద్యాధికారి మొగుళ్ల నర్సింహారెడ్డి ప్రారంభించారు.

◆ పరామర్శ

కొండపాక(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి తల్లి లక్ష్మి దశదినకర్మలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, ఎంపీపీ ర్యాగల్ల సుగుణ, మాజీ ఎంపీపీ బైరెడ్డి రాధాకిషన్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు.

◆ బ్యాంక్ రుణం సద్వినియోగం చేసుకోండి

హుస్నాబాద్: మెప్మా ఆధ్వర్యంలో ఎస్‌బీఐ బ్యాంక్ అధికారులు సోమవారం పట్టణ ప్రగతి స్వనిధి సే సమృద్ధి క్యాంపు నిర్వహించారు. శిబిరానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ హాజరై మాట్లాడారు. బ్యాంక్ రుణం తీసుకున్న స్ట్రీట్ వెండర్స్ క్రమం తప్పకుండా తిరిగి చెల్లిస్తూ వారి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.